RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | మంగళవారం 1 అక్టోబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 141 | పేజీలు: 4 | వెల: రూ.5/-

## ఎవరిని మెప్పించడం కోసం ఈ దూకుడు?

హైడ్రా అంటే కేవలం కూల్చివేతలే కాదు! తెలంగాణ హైకోర్టు సీరియస్



2లో..




## మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్

### లక్షన్నర కోట్లు పెట్టి ఏం సాధిస్తారు

ఇళ్లు ఇస్తామని..ఇప్పుడు కూలుస్తారా
మూసీలో పట్టాలు ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ
నమామి గంగే ప్రాజెక్టుకే 40వేల కోట్లు
సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కెటిఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆరోపించారు. లక్షన్నర కోట్లు కర్చు పెట్టి ఎవరిని ఉద్ధరిస్తారని అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎంని ప్రశ్నిస్తున్నా. మేం మొత్తం దేశంలో ఉండే అన్ని ప్రాజెక్టుల వివరాలు తెప్పించాం. నామామీ గంగే డీపీఆర్, ప్రాజెక్ట్ వివరాలు.. ప్రాజెక్టు పూర్వపరాలు తెప్పించాం. నమామి గంగే ప్రాజెక్టుపై ఆసక్తితో వివరాలు తెప్పించాను. 2400 కిలోమీటర్ల గంగానది ప్రక్షాళన కోసం కేంద్రం ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ చేసింది. ఈ ప్రాజెక్టుకు పెట్టిన బడ్జెట్ రూ.40వేలకోట్లు. 2400 కిలోమీటర్ల గంగా నదికి రూ.40వేలుకోట్లు. 50 కిలోమీటర్ల మూసీ సుందరీకరణ కోసం ఈ ముఖ్యమంత్రి రూ.1.50లక్షల కోట్ల ..మిగతా 2లో

# దసరాలోపు నియామకాలు

### సీఎం రేవంత్ మరో తీపికబురు

తెలంగాణ డీఎస్సీ ఫలితాలు విడుదల
వచ్చే నెల 9న
నియామక పత్రాల అందజేత







**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డీఎస్సీ ఫలితాలును సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ క్రమంలోనే.. దసరా పండుగలోపు ఫైనల్ నియామకాలు పూర్తి చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. అంతేకాకుండా.. తర్వలోనే గ్రూప్-1 ఫలితాలు కూడా విడుదల చేస్తామని ప్రకటించారు. మొదటి ఏడాదిలోనే 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో 20 నుంచి 25ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం తెలిపారు. తెలంగాణలో డీఎస్సీ-2024 ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మరో తీపికబురు వినిపించారు. దసరా పండగలోపు ఫైనల్ నియామకాలు పూర్తి చేస్తామని ప్రకటించారు. అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందిస్తామని చెప్పుకొచ్చారు. 11062 టీచర్ ఉద్యోగాల భర్తీకి విశేష కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలియజేశారు. 1:3 ప్రాతిపదికన ఫలితాలు ఫలితాలు విడుదల చేశామని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే.. గత ప్రభుత్వం పదేళ్లలో ఒకే ఒకసారి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. పదేళ్లలో వాళ్లు చేపట్టిన ఉపాధ్యాయ నియామకాలు కేవలం 7,857 మాత్రమేనన్నారు. విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన గత ప్రభుత్వానికి లేదని.. తాము అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ మొదలు పెట్టామన్నారు. విద్యకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. నిర్వహణ నుంచి నియామకాల వరకు 65 రోజుల్లో 11062 ఉద్యోగాల నియామకాలు పూర్తి ..మిగతా 2లో



### డిజిటల్ కార్డులపై 3 నుంచి

## క్షేత్రస్థాయి పరిశీలన

### మరోమారు సిఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** కుటుంబ డిజిటల్ కార్డుల పంపిణీ సమయంలో కుటుంబ సభ్యులు అంగీకరిస్తేనే కుటుంబం ఫొటో తీయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం గుర్తించిన కుటుంబాన్ని నిర్ధరించాలన్నారు. కుటుంబ డిజిటల్ కార్డులపై సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. డిజిటల్ కార్డుల కోసం సేకరించే వివరాలను అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అక్టోబరు 3 నుంచి 7 వరకు పైలట్ ప్రాజెక్టులో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలు, 238 ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలి. కొత్త సభ్యులకు జత చేసి, చనిపోయిన వారిని తొలగించాలి. పైలెట్ ప్రాజెక్టులో ఎదురైన వివరాలతో నివేదిక తయారు చేయాలి. కుటుంబ సభ్యుల వివరాల మార్పులు చేర్పుల్లో ..మిగతా 2లో

## హైదరాబాద్ మెట్రో యాజమాన్యం షాక్

### మెట్రో పార్కింగ్‌కు ఇక ఫీజు చెల్లించాల్సిందే



**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో యాజమాన్యం షాక్ ఇచ్చింది. నాగోల్, మియాపూర్ స్టేషన్ల వద్ద వాహనాల ఉచిత పార్కింగ్ సౌకర్యాన్ని ఎత్తేస్తూ మరోసారి నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 6నుంచి నాగోల్, మియాపూర్ మెట్రో పార్కింగ్ వద్ద ఛార్జీలు వసూలు చేయనున్నట్లు యాజమాన్యం తెలిపింది. అయితే గతంలోనూ పార్కింగ్ ఫీజు వసూలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టగా.. ప్రయాణికుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చింది. ఈ ఏడాది ఆగస్టు 14నుంచి ఛార్జీలు వసూలు చేస్తామని చెప్పడంతో పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. పలు రాజకీయ పార్టీలు సైతం ప్రయాణికులకు మద్దతు తెలిపాయి. నగరవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేయడం, మహా ధర్నాకు పిలుపునివ్వడంతో మెట్రో అధికారులు వెనక్కి తగ్గారు. తమ నిర్ణయాన్ని తాత్కాలికంగా వెనక్కి తీసుకున్నారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. అయితే తాజాగా మళ్లీ నాగోల్, మియాపూర్ స్టేషన్ల వద్ద పార్కింగ్ ఫీజు వసూలు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో మరోసారి వారి నిర్ణయంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. పెద్దఎత్తున దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఆగస్టు 14నుంచి మెట్రో స్టేషన్ల వద్ద వాహనాల పార్కింగ్ ..మిగతా 2లో



### మూసీ సుందరీకరణకు

## హైడ్రాకు సంబంధం లేదు

మూసీలో మార్కింగ్ కూడా
మేం చేపట్టడం లేదు
ఇదంతా మూసీ రివర్ ఫ్రంట్
కార్యక్రమన్న రంగనాథ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** మూసీ సుందరీకరణపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదన్నారు. మూసీ నది పరిధిలో నివసిస్తున్న వారిని హైడ్రా తరలించడం లేదని, నదిలో ఎలాంటి కూల్చివేతలు చేపట్టడం లేదన్నారు. నదీ పరివాహక ప్రాంతంలోని ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని, ..మిగతా 2లో

## కంటతడి పెట్టిన మంత్రి కొండా సురేఖ

### ట్రోలింగ్ పట్ల భావోద్వేగానికి గురయిన మంత్రి

కేటీఆర్ బట్టలు ఊడదీసి పరిగెత్తిస్తామని ఘాటు వ్యాఖ్యలు




**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** మంత్రి కొండా సురేఖ కంటతడి పెట్టారు. తనపై ట్రోలింగ్ వ్యవహారంపై సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఆమె తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. పలుమార్లు కంటతడి పెట్టారు. తనపై ట్రోలింగ్ పట్ల మంత్రి భావోద్వేగానికి గురయ్యారు. కేటీఆర్ ఖబడ్దార్ .. ఖబడ్దార్ కేసీఆర్ అని ఆమె హెచ్చరించారు. ఈ ట్రోలింగ్ వీడియోలను మీ చెల్లికి, తల్లికి చూపించు కేటీఆర్ అని అన్నారు. ఇకపై ట్రోలింగ్ చేస్తే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. అన్ని పార్టీల ..మిగతా 2లో

### ఎన్నాళ్లు కొట్లాడినా..

## లాయర్లకే లాభం

మీరు విడాకులు తీసుకుని
ఉద్యోగం చేయండి
ఉన్నత విద్యావంతురాలైన మహిళకు
సిజెఐ సూచన



2

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
# ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## ఎవరిని మెప్పించడం కోసం ఈ దూకుడు?

**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన వేళ.. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మరోసారి ఆ విభాగం పని తీరుపై స్పష్టత ఇచ్చారు. హైడ్రా అంటే కేవలం కూల్చివేతలు మాత్రమే కాదన్న ఆయన.. ప్రజలతో పాటు సామాజిక మాధ్యమాలు కూడా వాస్తవాలను తెలుసుకోవాలని కోరుతున్నారు. "మూసీ నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు సంబంధం లేదు. అక్కడి నివాసితులను హైడ్రా తరలించడం లేదు. అక్కడ ఎలాంటి కూల్చివేతలు హైడ్రా చేపట్టడం లేదు. మూసీ పరీవాహక ప్రాంతంలోని ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదు. మూసీ సుందరీకరణ ప్రత్యేక ప్రాజెక్టు. దీనిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతోంది" అని ఎక్స్ వేదిక ద్వారా తెలియజేశారు. అలాగే.. "హైడ్రా అంటే కూల్చివేతలే కాదు. హైడ్రా పరిధి ఔటర్ రింగు రోడ్డు వరకే. నగరంలోనే కాదు.. రాష్ట్రంలో.. ఆఖరుకు ఇతర రాష్ట్రాల్లో కూల్చివేతలు కూడా హైడ్రాకు ఆపాదించి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. హైడ్రా పేదల నివాసాల జోలికి వెళ్లదు. అలాగే నివాసం ఉంటే ఆ ఇళ్లను కూల్చదు. కూల్చివేతలన్నీ హైడ్రావి కావు. ప్రజలు, సామాజిక మాధ్యమాలు ఈ విషయాన్ని గుర్తించాలి. హైడ్రా ప్రధాన విధి ప్రకృతి వనరుల పరిరక్షణ. చెరువులు, కుంటలు, నాలాలను కాపాడడం, వర్షాలు, వరదల సమయంలో రహదారులు, నివాస ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవడం" అని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు. చేశారు.



# మూసీ రివర్ ఫ్రంట్ పెద్ద స్కామ్




మొదటి పేజీ తరువాయి...

ఖర్చు అవుతుందని సీఎం చెబుతున్నారు. దీన్ని స్కామ్ అనక ఏమనాలి. దీనివెనుక ఉన్న మతలబు ఏంటీ? చెప్పాలి కదా. అనుమతులు ఇచ్చిన ఇండ్లను కూల్చడమంటే ప్రభుత్వానికి తన వ్యవస్థ మీద, తన యంత్రాంగం, పరిపాలనపై తనకే పట్టులేనితనానికి నిదర్శనం కాదా? అని అడుగుతున్నానన్నారు. మున్సిపల్ మంత్రిగా నేను ఎనిమిదేళ్లు పని చేశాను. కూల్చాల్సి వస్తే.. మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్‌ను. కమిషనర్ ఎక్కడ కుసున్నడో.. బుద్ధ భవన్ నాలామీదున్న ఉన్నది. దాంట్లోనే ఎలక్షన్ కమిషనర్ ఉన్నడు. హైడ్రా కమిషనర్ ఉన్నరు. అందులో ఉమెన్స్ కమిషన్ ఉన్నది. మొదట ఆ భవనం కూల్చాలి. రెండోది ఏ జీహెచ్ఎంసీ పర్మిషన్‌లు ఇస్తదో.. ఆ జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని కూల్చాలి. జీహెచ్ఎంసీ ఆఫీస్ కూడా నాలాపైనే ఉన్నది. మరి ఇతరులకు సుద్దులు చెప్పే ముందు ఇక్కడి నుంచే మొదలిపెట్టాలి. నాకు తెలిసి సీఎంకి అవకాశం ఇస్తే.. కొత్తగా కట్టుకున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం కూలుస్తడు. ఆయనో లక్ష్యం పెట్టుకున్నడు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా పెట్టుకున్నడు. సెక్రటేరియట్ చూడంగనే అందరికీ కేసీఆర్ గుర్తుకు వస్తడు. మొన్న గణపతి బొప్ప మోరియా అనుకుంటా వెళ్లారు. అక్కడికి రాంగనే కేసీఆర్ గుర్తుకు వచ్చిండు.. కేసీఆర్ పాటలు పెట్టంగనే ముఖ్యమంత్రికి ఇరిటేషన్ వస్తున్నది. మూసీ బాధితుల ఆక్రందనలు చేస్తున్నా.. ఇబ్బంది పడుతుంటే.. నిన్న మొన్నటి వరకు డైలాగ్‌లు కొట్టిన మీ అధినాయకులు ఎక్కడా? మీ రాహుల్ గాంధీ యేడీ? మీ ప్రియాంక గాంధీ ఎక్కడ? అని ప్రశ్నించారు. కాళేశ్వరం అనేది ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు. ఒక పంటకు 40లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ప్రాజెక్టు. పరిశ్రమలకు 10శాతం నీళ్లు వస్తాయి. హైదరాబాద్ మహానగరంతో పాటు వేలాది గ్రామాలకు తాగునీరు ఇచ్చే ప్రాజెక్టు. హైదరాబాద్ నెత్తిమీద శాశ్వతంగా ఒక కుండపెట్టినట్టే కరువు తీర్చే కల్పతురువు కాళేశ్వరం. కాళేశ్వరం కట్టం తర్వాత వరిసాగులో భారతదేశంలో తెలంగాణ టాప్. ఇది కాళేశ్వరం పుణ్యం కాదా? రూ.లక్షకోట్ల పెట్టుబడితో ఏం జరిగిందంటే.. తెలంగాణ వరిసాగులో టాప్‌గా నిలిచింది' అన్నారు. కాళేశ్వరంతో తాగునీటి సమస్య పోయింది. హైదరాబాద్‌కు తాగునీటి సమస్య రానే రాదు. ఇప్పటికే మూసీ కింద ఉన్న ఆయకట్టు కాకుండా కొత్తగా ఏమన్న వస్తుందా? మూసీ ప్రాజెక్టులో రిజర్వాయర్ ఉన్నదా? పంప్ హౌస్ ఉన్నదా? అండర్‌గ్రౌండ్ టన్నెల్ ఉన్నదా? ఏం లేకున్నా రూ.1.50లక్షలకోట్లంటే స్కామ్ కాదా? అని తెలిపారు. థేమ్స్ నదికి కూడా ఖర్చుపెట్టింది దాదాపు రూ.40వేలకోట్లు. వీటన్నింటికంటే అద్భుతాన్ని ఆవిష్కరిస్తానంటే.. రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత? రాష్ట్ర ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఎంత? ఎవరి కోసం మూసీ ప్రాజెక్టు చేపడుతున్నవ్ చెప్పాలి. ఇంత వరకు రైతుబంధు దిక్కులేదు. కొత్త హామీలు కాదు.. ఇచ్చిన హామీలు ఏమాయ్యాయంటూ.. పెన్షన్లు ఎగ్గొట్టావంటే చెప్పేటోడు లేదు' కేటీఆర్ మండిపడ్డారు. వంద రోజుల్లో చేస్తామన్న పనులను 300 రోజులు దాటినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. వంద రోజుల్లోనే హామీలన్నీ నెరవేరుస్తామని పత్రికల్లో ప్రకటనలు సైతం ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు ఒక్క గ్యారంటీ కూడా అమలు చేయలేదన్నారు. మూసీ పరివాహక ప్రజల పట్ల సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తోన్న తీరు సరైంది కాదు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఇళ్లకు పట్టాలు వచ్చాయని పలువురు ప్రజలు చెప్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసినప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకు చెప్తున్నారని పేదలు అడుగుతున్నారు. గతంలో 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. చెరువులకు హద్దులు ఎందుకు గుర్తించలేదన్నారు. ఎఫ్‌టీఎల్ నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అని అన్నారు. ఇళ్లు కట్టిస్తామన్నారు కానీ.. కూల్చుతామని ఎన్నికల ముందు చెప్పారా? సాగరహారం లాంటి ఉద్యమాలు మళ్లీ రావాల్సిన అవసరం ఉంది. ప్రజలు తిరగబడితే మంత్రులు ఊళ్లల్లో కూడా తిరగలేరు. పేద ప్రజల ఇళ్లను ఇలా కూల్చేస్తూ ఉంటే మేం చూస్తూ ఊరుకోం. ఇకపై బుల్డోజర్లకు భారాస నేతలు అడ్డుగా ఉంటారని కేటీఆర్ హెచ్చరించారు.




## దసరాలోపు నియామకాలు

మొదటి పేజీ తరువాయి...

చేస్తున్నామని వివరించారు. ఇది విద్యపై తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో పేదలకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్నదే తమ ఆకాంక్ష అని రేవంత్ రెడ్డి తెలిపారు. అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాల నియామక పత్రాలు అందించామన్నారు. నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని టెట్ నిర్వహణ తర్వాతే డీఎస్సీ నిర్వహించామన్నారు. టీజీపీస్సీని ప్రక్షాళన చేశామని సీఎం తెలిపారు. త్వరలోనే గ్రూప్-1 ఫలితాలు ప్రకటించి తెలంగాణ పునర్నిర్మాణంలో వారిని కూడా భాగస్వామ్యం చేస్తామన్నారు. మొదటి ఏడాదిలోనే 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. టీచర్ ఉద్యోగం కేవలం ఒక ఉద్యోగం కాదు.. అది భావోద్వేగమని అభివర్ణించారు. గత పదేళ్లలో విద్య నిర్లక్ష్యానికి గురైందన్నారు. తాము వచ్చాక విద్య శాఖకు నిధుల కేటాయింపు పెంచామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. గత ప్రభుత్వం స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించలేదని.. అందుకే తమ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తోందన్నారు. 100 నియోజకవర్గాల్లో 20 నుంచి 25ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్ మధిరలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టలేదన్నారు. తమ ప్రభుత్వం వివాదాలకు తావు లేకుండా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసిందని తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీల మీడియాలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై మాపై దుష్ప్రచారం చేస్తున్నాయన్న సీఎం రేవంత్ రెడ్డి.. పదేళ్లు ప్రభుత్వంలో ఉన్నవాళ్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని, అందుకే ఈ ఉపద్రవం వచ్చిందన్నారు. వాటన్నింటిని పరిష్కరించుకుంటూ తాము ముందుకెళుతున్నామన్నారు. విద్యపై పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి అని తాము భావిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. విద్యార్థుల సంఖ్యతో ప్రమేయం లేకుండా ప్రభుత్వ పాఠశాలలు నిర్వహిస్తామన్నారు. పేదలకు విద్య అందించడమే తమ విధానమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

## డిజిటల్ కార్డులపై 3 నుంచి క్షేత్రస్థాయి పరిశీలన

మొదటి పేజీ తరువాయి...

జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేక, పలువురు అధికారులు పాల్గొన్నారు.

**ఢిల్లీ వెళ్లిన సిఎం రేవంత్ రెడ్డి**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి బయల్దేరారు. ఇటీవల జమ్ముకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం ఆయన పరామర్శించనున్నారు. ఆ తర్వాత ఢిల్లీలోని పార్టీ ముఖ్యనేతలతో సమావేశం కానున్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన తదితర అంశాలపై ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు ఎదురవుతున్న నేపథ్యంలో, ఈ నిర్ణయం తీసుకోవడం వెనక ఉన్న కారణాలను ఆయన అధిష్ఠానానికి వివరించే అవకాశముంది.

## మూసీ సుందరీకరణకు హైడ్రాకు సంబంధం లేదు

మొదటి పేజీ తరువాయి...

మూసీ సుందరీకరణ అనేది ప్రత్యేక ప్రాజెక్టని చెప్పారు. దానిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని వెల్లడించారు. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో ఇటీవల జరుగుతున్న కొన్ని ఆందోళనలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరణ ఇచ్చారు. నదీ పరివాహక ప్రాంతంలో నివాసితుల భద్రత, పునరావాసం, కూల్చివేతలకు సంబంధించిన వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో, కమిషనర్ కొన్ని ముఖ్యమైన వివరాలను వెల్లడించారు. మూసీ నదికి ఇరువైపులా జరుగుతున్న సర్వేలు హైడ్రాకు సంబంధించినవి కాదని స్పష్టంగా అవగాహన చేయాలని కోరారు. ఈ సర్వేలు హైడ్రా చట్టం లేదా ప్రాజెక్టుకు సంబంధించినవి కాదని తెలిపారు. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను హైడ్రా తరలించడం లేదని ఆయన స్పష్టం చేశారు. నివాసితులపై జరుగుతున్న ఇబ్బందులు తప్పనిసరిగా నివారించబడాలని హైడ్రా సంస్థ భావిస్తోం



దన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఎలాంటి ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని ఆయన తెలిపారు. ఇది నివాసితుల కష్టాలను, అసౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని చేయబడిన నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్నదని, ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతాన్ని అందంగా మార్చడం, పర్యావరణ సురక్షణపై దృష్టి సారించడం ద్వారా స్థానిక ప్రజలకు ప్రయోజనాలు అందించడం లక్ష్యంగా ఉందన్నారు. ఈ ప్రకటనలు, వాస్తవాలను స్పష్టం చేసేందుకు, ప్రజల భద్రతా ఆశలపై హైడ్రా సంస్థ కట్టుబడినట్టు తెలియజేయడానికి ఒక ప్రయత్నమన్నారు. ప్రజలు భద్రత కోసం కృషి చేయాలని, వాటిని మరింత నిశ్చితంగా, సహాయకరంగా చూడాలని కమిషనర్ కోరారు. ప్రజల, హైడ్రా సంస్థ మధ్య అనుబంధాన్ని మెరుగుపరచడం, స్థానిక అభివృద్ధికి దోహదం చేయడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని.. ఆయన సూచించారు.

## ఎన్నాళ్లు కొట్లాడినా.. లాయర్లకే లాభం

### మీరు విడాకులు తీసుకుని ఉద్యోగం చేయండి

#### ఉన్నత విద్యావంతురాలైన మహిళకు సిజెఐ సూచన



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** వైవాహిక బంధంలో వివాదాలకు సంబంధించిన ఓ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారంలో సుదీర్ఘ న్యాయపోరాటం వల్ల అది న్యాయవాదులకే ప్రయోజనంగా మారుతుందని అన్నారు. అందువల్ల పరస్పర సమ్మతితో విడాకులకు అంగీకరించాలని ఆ దంపతులకు సూచించారు. తమ జంట మధ్య వివాదానికి సంబంధించిన కేసును మరో కోర్టుకు బదిలీ చేయాలంటూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈసందర్భంగా సదరు మహిళ విద్యార్హతలను చీఫ్ జస్టిస్ అడిగారు. తాను ఎంటెక్ పూర్తిచేసి, అమెరికా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు ఆమె సమాధాన మిచ్చారు. అయితే, ప్రస్తుతానికి తానేమీ ఉద్యోగం చేయట్లేదని పేర్కొన్నారు. దీనికి సీజేఐ జస్టిస్ డి.వై చంద్రచూడ్ స్పందిస్తూ.. మీరు విద్యావంతులు. ముందు మంచి ఉద్యోగం సంపాదించండి. ఈ కేసులో మీరు 10 ఏళ్లయినా న్యాయపోరాటం చేయగలరేమో..! కానీ దానివల్ల కేవలం న్యాయవాదులకే ప్రయోజనం కలుగుతుంది. మీరెందుకు పరస్పర సమ్మతితో విడాకులు తీసుకునేందుకు అంగీకరించ కూడదు మీరు అందుకు అంగీకరిస్తే కేసును మూసేస్తాం. మీరు వైవాహిక బంధాన్ని తిరిగి కొనసాగించే పరిస్థితుల్లో లేరని స్పష్టమవుతోంది. మీరు నిరక్షరాస్యులైతే కేసు వేరేగా ఉండొచ్చు. కానీ మీరు చదువుకున్నవారు.. ఉద్యోగం సంపాదించగలరు అని ఆ మహిళకు సూచించారు.

## కంటతడి పెట్టిన మంత్రి కొండా సురేఖ

మొదటి పేజీ తరువాయి...

వాళ్లు తనను అక్కా అని, తన భర్తను బావ అని పిలుస్తారని ఆమె చెప్పారు. ఇంకోసారి ఇలా చేస్తే కేటీఆర్ బట్టలు ఊడదీసి పరిగెత్తిస్తామని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. రఘునందన్ కాల్ చేసి క్షమించమని అడిగాడని, అక్కా క్షమించు కాళ్లు మొక్కుతా అని రఘునందన్ అన్నాడని ప్రస్తావించారు. సిగ్గు లజ్జ ఉంటే బట్టలు లేకుండా తిరుగాలంటూ రఘునందన్‌ను విమర్శించారు. ఏదో ఒకరోజు ప్రజలు తిరగబడతారు. చేనేత కార్మికుల ఓట్లతో గెలిచి పద్మశాలి బిడ్డను ఇంత అవమన పరుస్తారా?. మానసిక వేదన కలిగించి కుటుంబాల్లో ఇబ్బంది పెడుతారా?. నాకు మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తుందనే కేసీఆర్ మహిళకు మంత్రిపదవి ఇవ్వలేదు. రెండవరసారి అధికారంలోకి వచ్చాక బీఆర్‌ఎస్‌లో భారీ మార్పులు వచ్చాయి. బీఆర్ఎస్ నాయకులు డబ్బు మదం ఎక్కి పిచ్చిగా ప్రవర్తిస్తున్నారు అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ట్రోల్ చేస్తున్న ఫొటోల్లో తప్పు ఏముందో కేసీఆర్ భార్య శోభమ్మ చెప్పాలని మంత్రి కొండ సురేఖ అన్నారు. 'ఉన్నత వర్గం అనే బలుపు బీఆర్ఎస్‌కు ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సంబంధించిన మహిళలపై ఇలాంటి ట్రోలింగ్ చేస్తున్నారు. పనులు కావాలంటే నా దగ్గరికి రండి అని గత పాలకులు ఇబ్బంది పెట్టారు. హరీష్ డీపీ పెట్టుకొని ట్రోల్ చేస్తున్నారు. కేటీఆర్ హరీశ్ భేషరతుగా క్షమాపణ చెప్పాలి. డిస్కో డాన్సులు నేర్పిందే మీ చెల్లి. అమెరికా సంస్కృతి తెచ్చి బతుకమ్మకు అంటించింది మీ చెల్లి. బతుకమ్మ సహజత్వాన్ని చెడగొట్టిందే మీ చెల్లి అంటూ మంత్రి ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

## హైదరాబాద్ మెట్రో యాజమాన్యం షాక్

మొదటి పేజీ తరువాయి...

ఫీజు వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ప్రీపెయిడ్ పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే అదే రోజు ఉదయం నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద పార్కింగ్ చేసేందుకు వెళ్లిన ప్రయాణికులు బోర్డు చూసి అవాక్కయ్యారు. దీంతో అందరూ ఒక్కసారిగా నాగోల్ మెట్రో స్టేషన్‌లో ఆందోళనకు దిగారు. ఎప్పటిలాగే ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అరకొర జీతాలతో జూబ్లీహిల్స్, మాదాపూర్ ప్రాంతాల్లో ఉండలేక నాగోల్, ఎల్బీ నగర్ ప్రాంతాల్లో ఉంటున్నామని, ఛార్జీలు కాకుండా అదనంగా పార్కింగ్ ఫీజు చెల్లించాలంటూ మెట్రో కొత్త రూల్స్ తీసుకురావడం దారుణం అని మండిపడ్డారు. ద్విచక్రవాహనాన్ని 2గంటలు పార్కింగ్ చేస్తే



రూ.10, అలాగే 8గంటలపాటు చేస్తే రూ.25 చెల్లించాలి. 12గంటలపాటు పార్క్ చేయాల్సి వస్తే రూ.40కట్టాలి. ఓ కారు రెండు గంటలు పార్క్ చేస్తే రూ.30, 8గంటలపాటు అయితే రూ.75, 12గంటలపాటు పార్క్ చేస్తే రూ.120 చెల్లించాలి. అదనంగా ఒక్కో గంటకు మరో రూ.5చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. 40శాతం డిస్కౌంట్‌తో నెలవారీ పాసులు ఇచ్చేందుకు సైతం మెట్రో అధికారులు సౌలభ్యం కల్పించారు. పోనీ ఇంత నగదు వసూలు చేసినప్పటికీ కూడా వాహనాల భద్రతకు మాత్రం భరోసా ఇవ్వడం లేదు. వాహనాలు దొంగతనాలకు గురైనా, దెబ్బతిన్నా, ఏవైనా వస్తువులు పోయినా తమకు ఎలాంటి సంబంధం లేదంటూ అధికారులు బోర్డు పెట్టడంపైనా వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాలకు వెళ్లేవారు రోజుకు రూ.40 అంటే నెలకు రూ.1200 వందలు చెల్లించాలని, దీని వల్ల తమ కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని వారు వాపోయారు. దీంతో వారంతా నిరసనలకు దిగారు. పెద్దఎత్తున ఆందోళనలు చేస్తుండడంతో మెట్రో యాజమాన్యం వెనక్కి తగ్గింది. ప్రస్తుతం మళ్లీ అదే విధానాన్ని తీసుకురావడంతో ఇప్పుడు ప్రయాణికులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# మెట్రో ఆఫర్ గడువు మార్చి వరకు పొడిగింపు



హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు): ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైలు గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రయాణికులకు అందిస్తున్న ఆఫర్లను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 2025 మార్చి 31 వరకు ఆఫర్లను పొడిగించినట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం అందిస్తున్న సూపర్ సేవర్-59, స్టూడెంట్ పాస్, సూపర్ సేవర్ ఆఫ్ పీక్ ఆఫర్లను పొడిగించింది. అక్టోబర్ 6 నుంచి నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్లలో నామమాత్రపు పార్కింగ్ ఫీజు వసూలు చేయనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల సౌలభ్యం, భద్రత కోసమే ఈ రుసుము వసూలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి తెలిపారు.




# రైతుల సంక్షేమానికి మరింత కృషి

## సహకార సంఘం చైర్మన్ చేగురి భరత్ కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు): సంఘం పరిధిలోని రైతుల సంక్షేమానికి, వారి కుటుంబాలకు అండగా బాటసింగారం రైతు సేవా సహకార సంఘం కృషి చేస్తుందని సంఘం చైర్మన్ చేగూరి భరత్ కుమార్ అన్నారు. సోమవారం బాటసింగారం రైతు సేవా సహకార సంఘం 55వ మహాజన సర్వసభ్య సమావేశం మండల కేంద్రంలోని సహకార సంఘం ఆవరణంలో సంఘం చైర్మన్ సాదాసీదాగా కొనసాగింది. ఈ సమావేశంలో సంఘం వ్యవహారాల నివేదిక, జమ ఖర్చులు, 2023-2024 ఆర్థిక సంవత్సరపు ఆడిట్ రిపోర్ట్ ఆమోదం, రైతుల వాటాదనం, ఇతర ఎజెండా అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ చేగురి భరత్ మాట్లాడుతూ.. గత పాలకుల అవకతవకలను ఎండగడుతూ.. సంఘం అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తూ, అర్హులైన ప్రతి సభ్యునికి రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. రాబోవు రోజుల్లో 10 లక్షల రుణాల గరిష్ట పరిమితి పెంచేందుకు కృషి చేస్తామని అన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళతామని పేర్కొన్నారు. అనంతరం రుణాల కిస్తులను సకాలంలో చెల్లించిన ఆదర్శ రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సర్కిల్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవి కుమార్, సంఘం ఉపాధ్యక్షురాలు నార్లకొండ మల్లమ్మ, డైరెక్టర్లు గుండె బాలనరసమ్మ, చింతల లక్ష్మమ్మ, మొగుళ్ళ చిన్న యాదిరెడ్డి, బిజిలి బాల నరసింహ, గంటా శ్రీనివాసరెడ్డి, ఇటికల మహేందర్ రెడ్డి, మేకల రాములు, మేనేజర్ ఐలేష్, బ్యాంకు అసిస్టెంట్ రాకేష్, సూపర్వైజర్లు, బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# నాడు కూల్చివేశారు.. నేడు కట్టనిచ్చారు



గతంలో అక్రమ నిర్మాణాలు అంటూ కూల్చివేసిన వ్యాపార సముదాయాలు



ప్రారంభోత్సవానికి సిద్ధంగా గతంలో అధికారులు కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు): 'కంచే చేను మేసిన' చందంగా తయారైంది పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు. మున్సిపాలిటీ పరిధిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. గతంలో అక్రమ నిర్మాణాల పేరిట కూల్చివేతలు చేసిన మున్సిపల్ అధికారులు, అవే అక్రమ నిర్మాణాలు నేడు పూర్తయ్యాయంటే వస్తున్న విమర్శలకు బలం చేకూరుతోంది. నాడు ప్రభుత్వ అనుమతులు లేవంటూ కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు, నేడు యదేచ్ఛగా నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయంటే అధికారుల తీరుపై పలు అనుమానాలకు, ప్రశ్నలకు దారితీస్తోంది. నాడు ముడుపులు ముట్టలేదు కనుక కూల్చివేశారని, నేడు ముడుపులు అందాయి కనుకనే అక్రమ నిర్మాణాలు పూర్తయ్యాయి అంటూ పలువురు నాయకులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. గత మే నెలలో మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డ్ బలిజ గూడ రోడ్డులోని పలు వ్యాపార సముదాయాలను అక్రమ నిర్మాణాల పేరిట కూల్చివేశారు. దీనిపై అప్పుడే 'ప్రభాత సూర్యుడు దినపత్రిక' 'మొక్కుబడిగా అక్రమ నిర్మాణాల కూల్చివేత' అంటూ వార్త ప్రచురించింది. నేడు అవే కట్టడాలు యదేచ్ఛగా పూర్తి చేసుకున్నాయంటే అధికారుల తీరుపై సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో అనుమతులు లేవని కూల్చేసిన కట్టడాలకు, నేడు అనుమతులు ఉన్నాయా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ అనుమంతులుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, అనుమతులు లేకుండానే నిర్మాణాలు పూర్తయితేనే అధికారుల తీరుపై అనుమానం వ్యక్తం చేయాల్సి వస్తుందని అంటున్నారు. ఒకవేళ అట్టి అక్రమ నిర్మాణాలు అధికారుల దృష్టిలో లేకపోయి ఉంటే, ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
26 May 2024 - Page 2

మొక్కుబడిగా అక్రమ నిర్మాణాలకు కూల్చివేత

- కూల్చివేత చర్యల్లో అనుమానాలు

అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు : పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ప్రయోగించినట్లు ' ప్రభుత్వ ఖజానాకు లక్షల రూపాయలు గండి కొడుతూ నిర్మించిన భారీ షెడ్లను, అక్రమ సెల్లార్ నిర్మాణాలను వదిలేసి, చిన్నాచితక నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు ప్రతాపం చూపారు. పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు శనివారం తూతూ మంత్రంగా కూల్చివేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 5,6,9,23 ఇతర వార్డులలో పెద్ద ఎత్తున అనుమతి లేని భారీ షెడ్లను వదిలేసి చిన్న చిన్న షట్టర్లను కూల్చి వేయడంతో పలు అనుమానాలకు దారితీస్తుంది. గత కొద్ది రోజులుగా అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందుతున్నా.. ఎలక్షన్ కోడ్ అంటూ దాటవేస్తూ వచ్చిన మున్సిపాలిటీ అధికారులు శనివారం అక్రమ నిర్మాణాలను కూల్చి వేయడంతో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణదారుల నుండి పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయి కాబట్టే భారీ షెడ్ల జోలికి వెళ్లలేదని, ఎలాంటి ముడుపులు అందలేదు కాబట్టే చిన్న చిన్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నారని నష్టపోయిన నిర్మానుదారులే విమర్శించడం గమనార్హం.

ప్రభాత సూర్యుడు దినపత్రికలో మే 25న ప్రచురితమైన వార్త




# తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత

## కాంగ్రెస్ కార్యకర్తల రాకతో ఘర్షణ

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు): హైడ్రా కూల్చివేతల కారణంగా జరుగుతున్న రాజకీయంలో నేతల మధ్య రాజకీయ వాగ్వాదాలు శృతి మించి పోతున్నాయి. ఫలితంగా దాడులకు సైతం దిగితున్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న తెలంగాణ భవన్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తల రాకతో ఉద్రికత్త నెలకొంది. ఒక్క సారిగా వందల మంది రావడంతో పోలీసులు ఉలిక్కి పడ్డారు. విషయం తెలిసి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా రావడంతో.. తెలంగాణ భవన్ ఎదురట ఉద్రిక్తత ఏర్పడింది. బీఆర్ఎస్ సోషల్ మీడియాకు చెందిన వారు మంత్రి కొండు సురేఖపై నీచంగా కామెంట్లు పెట్టారని.. పోస్టులు పెట్టారని ఆరోపిస్తూ వరంగల్ నుంచి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు ఈ ముట్టడికి ప్రయత్నించినట్లుగా తెలుస్తోంది. కాంగ్రెస్ కార్యకర్తలను అదుపు చేయడానికి పోలీసులు సరైన సంఖ్యలో లేకపోవడంతో బీఆర్ఎస్ కార్యకర్తలే వారితో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ ఆందోళనల్లో మహిళా నేతలు,కార్యకర్తలు ఉండటంతో పరిస్తితి ఎటు వైపు వెళ్తుందోనని కంగారు పడ్డారు. ఈ వివాదం కారణంగా అత్యంత బిజీగా ఉండే జూబ్లిహిల్స్ కేబీఆర్ పార్క్ రోడ్ లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు కాసేపటికి అందర్నీ పంపించివేశారు. ఓ వైపు హైడ్రా విషయంలో హైకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో ఇలా తెలంగాణ భవన్‌పైకి కాంగ్రెస్ కార్యకర్తల్ని ఉసిగొల్పడం వెనుక రాజకీయ కుట్ర ఉందని బీఆర్ఎస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలతో పాటు ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం, టీ న్యూస్ చానల్ కార్యాలయం కూడా ఉంది. చానల్ ఆ భవనం నుంచి ప్రసారమవుతుంది. కాంగ్రెస్ కార్యకర్తలు తెలంగాణ భవన్ లోపలికి వరకూ వెళ్లి ఉంటే పెద్ద సమస్య అయ్యేదని అంచనా వేస్తున్నారు. కాసేపటికి పరిస్థితి సద్దుమణిగింది. ఇరవైపులా దాడుల వరకూ వెళ్లకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణ భవన్ మీదకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను చితకబాదామని రేవంత్ రెడ్డికీ అదే పరిస్థితి వస్తుందని బీఆర్ఎస్ హెచ్చరించింది.

# వృత్తితో పాటు సేవా ప్రవృత్తి ఉండాలి

## - సీఐ ప్రవీణ్ రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు): మనము చేసే వృత్తి తో పాటు సేవలు చేసే ప్రవృత్తి కూడా కలిగి ఉండాలని పటాన్‌చెరు సిఐ ప్రవీణ్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్ ప్రాంగణంలో అమేత హాస్పిటల్ సౌజన్యంతో మంజీరా విజ్ఞాన కేంద్రం సి ఐ టి యు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ఏదో సామాజిక సేవా రంగంలో భాగస్వాములు కావాలని అన్నారు. సేవారంగంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని ఉపన్యసించారు. పోలీస్ అధికారిగా వృత్తి ధర్మం నిర్వర్తిస్తూ పౌర సమాజం చేసే సామాజిక సేవ కార్యక్రమాల్లో తరచుగా పాల్గొంటున్నానని అన్నారు. విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సైతం విద్యతోపాటు సామాజిక సేవ కార్యక్రమాలలో పాల్గొనాలని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో కొంత వరకు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, అదే రూరల్ ప్రాంతంలో అనుకున్నంత వైద్య సేవలు లేవని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇలాంటి మెడికల్ క్యాంపులు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని తెలిపారు. సి ఐ టి యు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు మంజీరా విజ్ఞాన కేంద్రం శాశ్వత సభ్యులు అయిన కే రాజయ్య మాట్లాడుతూ అమేది హాస్పిటల్స్ యాజమాన్యం 100 మందికి పైగా అసంఘటిత కార్మికులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు ఇచ్చి మెగా మెడికల్ క్యాంపులో అవసరమైన వారిని అమేది హాస్పిటల్ కు పంపించారని అన్నారు. ఆమెది హాస్పిటల్స్ డైరెక్టర్ రాజేంద్ర మాట్లాడుతూ పతాన్ చెరువు పట్టణంలో హాస్పటల్ ఏర్పాటు చేసినప్పటి నుంచి బీదలు, మధ్యతరగతి కుటుంబాల వారికి, పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు వైద్యం వ్యాపార దృష్టితో చూడక తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్సలు నిర్వహించి, కొద్ది రోజుల్లోనే పారిశ్రామిక ప్రాంతం మొత్తంలో తమ అమేధి హాస్పటల్ కు ప్రజల నుండి గుర్తింపు రావడం సంతోషంగా ఉందని అన్నారు. ముందు ముందు కూడా ఇట్టి ఉచిత మెడికల్ మేఘ క్యాంపులు నిర్వహించి సామాజిక సేవలో భాగస్వాములం అవుతామని అన్నారు. ఉచిత మేఘ మెడికల్ క్యాంపు కార్యక్రమంలో మంజీరా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ అర్జున్, కో కన్వీనర్ అబ్దుల్ బాసిద్, డాక్టర్ ధనుంజయ, డాక్టర్ రాజశేఖర్, చిరంజీవి సిఐటియు నాయకులు వాజిద్ అలీ, పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, అర్జున్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




ఉచిత వైద్య శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐ ప్రవీణ్ రెడ్డి

# జర్నలిస్టుల సంక్షేమం కోసం పని చేస్తాం



## జర్నలిస్టు ఇండ్ల స్థలాల దరఖాస్తు పత్రాల ఆవిష్కరణ

## జర్నలిస్టు ఇండ్ల స్థలాల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

## టీయుడబ్ల్యూజే(ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు): జర్నలిస్టుల సంక్షేమమమే ధ్యేయంగా టీయుడబ్ల్యూజే(ఐ జెయు) పని చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి , రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో సోమవారం టియుడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జర్నలిస్టు ఇంటి స్థలాల దరఖాస్తు పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం కోసం గత పది సంవత్సరాలుగా యూనియన్ అనేక పోరాటాలు చేసిందని అన్నారు. ప్రస్తుతం ఇండ్ల స్థలాల కోసం చేపడుతున్నటువంటి విలేకరుల వివరాల సేకరణ అనంతరం నియోజకవర్గాల వారీగా లిస్టులను తయారుచేసి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి అందజేస్తామని స్పష్టం చేశారు. ఆయన నుంచి ప్రభుత్వానికి నివేదిక అందజేసేందుకు రాష్ట్ర యూనియన్ నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. సంఘాలకు అతీతంగా నియోజకవర్గంలో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల వివరాలను సేకరించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లు అసలు ఎవరు కొసరు ఎవరు అనేది తేల్చాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అర్హులైన జర్నలిస్టులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటి స్థలాలతో పాటు ఆరోగ్య భీమా కల్పన తదితర అంశాలపై పెద్ద ఎత్తున కసరత్తు జరుగుతుందని అన్నారు .త్వరలో జిల్లా కేంద్రంగా రాష్ట్ర స్థాయి పాత్రికేయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి మన సమస్యలు పరిష్కరించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయవలసిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా టియుడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు కటకం సుభాష్, కోశాధికారి సంరెడ్డి శశి పాల్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, సోలిపురం రజనీకాంత్ రెడ్డి, వర్దెల్లి దశరథ, రచ్చ శేఖర్, శ్యాం ప్రసాద్, జంగయ్య, చెప్పల శ్రీనివాస్, మేకల రవీందర్ రెడ్డి, చెరుకు వెంకట్ స్వామి గౌడ్, నామ ఆంజనేయులు, చెరుకు ఉపేందర్ గౌడ్, ఇరుగు నాగరాజు, మధు, రమేష్, శ్రీనివాసరావు, రాజు, మహేష్, మట్ట అశోక్ గౌడ్, రాజేంద్ర నగర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, సూర్య నారాయణ, ప్రేమ్ ,చందు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## నెతన్యాహుతో మాట్లాడిన ప్రధాని మోదీ





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో ఫోన్‌లో సంభాషించారు. పశ్చిమాసియాలో ఇటీవలి పరిణామాలపై ఆయన చర్చించారు. ప్రస్తుత ప్రపంచంలోనే ఉగ్రవాదానికి చోటులేదని తేల్చిచెప్పారు. ప్రాంతీయ ఉద్రిక్తతలను నివారించడం ఎంతో అవసరమని నొక్కిచెప్పారు. అదే సమయంలో బందీలందరినీ సురక్షితంగా విడుదలయ్యే లా చూడాలన్నారు. పశ్చిమాసియాలో సాధ్యమైనంత త్వరగా శాంతి, సుస్థిరతలను నెలకొల్పే ప్రయత్నాలకు భారత్ మద్దతుగా నిలుస్తుందని నెతన్యాహూకు హామీ ఇచ్చినట్లు ప్రధాని మోదీ 'ఎక్స్'లో తెలిపారు. అయితే, ప్రత్యేకంగా ఏ సంఘటననూ ప్రధాని మోదీ ప్రస్తావించలేదు.

## దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి

**శ్రీవారి లడ్డూలో కల్తీ జరిగిందని ఎలా గుర్తించారు**
**లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగంపై ఆధారాలు ఉన్నాయా**
**వివరాలు తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటిస్తారు**
**ప్రస్తుత పరిస్తితుల్లో సిట్ దర్యాప్తుపై అనుమానాలు**
**సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వివాదంపై సుప్రీంకోర్టు ఘాటుగా స్పందించింది. దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని హితవు పలికింది. లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారనడానికి ఆధారాలు ఏమైనా ఉన్నాయా అని ప్రభుత్వం తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీని జస్టిస్ బి ఆర్ గవాయ్, జస్టిస్ కేవీ వి బాలకృష్ణన్ ధర్మాసనం ప్రశ్నించింది. కల్తీ నెయ్యిని లడ్డూలో వాడారో లేదో పూర్తిగా తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటన చేస్తారని సుప్రీంకోర్ట్ నిలదీసింది. ఈ అంశంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించిన అనంతరం కల్తీ నెయ్యిపై మీడియా ముందు ప్రకటన చేయడంపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటువంటి ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా నియమించిన సిట్ సరిగ్గా విచారణ జరపగలదా? అన్న సందేహాలు ఉన్నాయని న్యాయస్థానం పేర్కొంది. స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించినట్లు ఎలా తెలిసిందంటూ సుప్రీంకోర్ట్ సందేహం వ్యక్తం చేసింది. అలాగే స్వామి వారి ప్రసాదం లడ్డూని పరీక్షల కోసం ల్యాబ్‌కి ఎప్పుడు పంపారని ముకుల్ రోహత్గిని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపితే బావుంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అనంతరం ఈ కేసు విచారణను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ బాలకృష్ణన్ ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తిరుమల లడ్డూ వివాదంపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. తిరుమల స్వామివారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి నట్లు ఆరోపణలు నేపథ్యంలో ఈ అంశంలో నిజం నిగ్గూ తేల్చాలంటూ బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిపింది. తత ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఎన్‌డీడీబీ నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోర అపచారం జరిగిన నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో శాంతి హోమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది. అలాగే సంప్రోక్షణ కార్యక్రమాన్ని సైతం చేపట్టింది. అందులోభాగంగా ఆనంద నిలయంతో పాటు తిరుమల మాఢవీధుల్లో సైతం సంప్రోక్షణ నిర్వహించింది. మరోవైపు తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. గుంటూరు ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి నేతృత్వంలో సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో శనివారం సిట్ బృందం తిరుమల చేరుకుని.. తన దర్యాప్తును ప్రారంభించింది.

## కాళేశ్వరం అవినీతి దేశమంతా తెలుసు

**తప్పులు కప్పిపుచ్చుకునేందుకే బిఆర్ఎస్ ఆరోపణలు**
**మండిపడ్డ మంత్రి సీతక్క**



**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో భారాస చేసిన అవినీతి దేశమంతా తెలుసని మంత్రి సీతక్క పేర్కొన్నారు. భారాస పాలనలో జరిగిన తప్పిదాలను కనుమరుగు చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గత పదేళ్లలో మూసీ పరివాహకంలో ఎన్నో అక్రమ కట్టడాలు వెలిశాయన్నారు. కొందరు చెరువుల మధ్యలో భవనాలను నిర్మించారన్నారు. మూసీ పరివాహకంలో ఎక్కువగా నేతల భవనాలే ఉన్నాయని, వాటిని పేదలకు అ÷-దదెకు ఇచ్చారని విమర్శించారు. మూసీలో ఆక్రమణలతో అందరికీ ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. సామాన్యులకు నష్టం కలగకుండా చూస్తామన్నారు. ఇళ్లు కోల్పోతున్న పేదలకు స్థిర నివాసం కల్పిస్తామన్నారు. మిడ్ మానేరు, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల విషయంలో నిర్వాసితులను భారాస ఎంత నిర్దాక్షిణ్యంగా ఖాళీ చేయించారో అందరికీ తెలుసని, ఇప్పుడు హరీశ్‌రావు, కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు.

## రైతులను రోడ్డుకీడ్చిన ఘనత బిజెపిది

**వీరు రైతుల గురించి మాట్లాడడమా**
**బిజెపి నేతల ధర్నాపై మండిపడ్డ తుమ్మల**



**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం వెయ్యి ఎలుకలు తిన్న పిల్లి.. కాశీకి పోయినట్లుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. రైతులను రాజధాని వీధులకు ఈడ్చిన ఘనత బిజెపిదన్నారు. రైతు చట్టాలతో ఎంతమంది ఉసురు తీసారో చెప్పగలరా అని ప్రశ్నించారు. చాలా మంది రైతులకు రుణమాఫీ జరగలేదని భాజపా నాయకులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు. 2022 కల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతుల ఆదాయం రెట్టింపు కాదు కదా.. గత పదేళ్లలో పెరిగిన ఖర్చులతో పోల్చుకుంటే నికర ఆదాయం పెరగని వాళ్లందరి సమాచారం మీ దగ్గర ఉందా? స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేసి.. రైతులను ఆదుకోవాలంటూ రాజధాని వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న వారి విజ్ఞప్తులను ఎప్పుడైనా పట్టించుకున్నారా? భాజపా పాలిత రాష్ట్రాల్లో ఏ ఒక్క రాష్ట్రంలోనైనా రుణమాఫీ చేసి చూపించగలరా? రూ. లక్షల కోట్లు ఎగ్గొట్టిన పారిశ్రామికవేత్తల నుంచి నిధులు రికవరీ చేసి దేశవ్యాప్తంగా ఉన్న రైతుల రుణమాఫీ చేయగల నిబద్ధత మీకుందా? కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతులకు భరోసా కల్పించే బాధ్యత మాది. ఇప్పటికే సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాం. పంటలన్నింటినీ మద్దతు ధరకే కొనుగోలు చేసేందుకు ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని తుమ్మల పేర్కొన్నారు.

## దసరాకు ఊరెళుతున్నారా.. అయితే జాగ్రత్త

**నగలు, నగదు జాగ్రత్త చేసుకోవాలి**
**భద్రతా చర్యలు సూచించిన సైబరాబాద్ పోలీసులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** దసరా పండగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లేవారికి సైబరాబాద్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. పండగ వేళ ఊరెళ్తే తప్పకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇంట్లో ఎవరూ లేకుండా వెళ్లిపోతే సొమ్మును జాగ్రత్త చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాధారణ రోజుల కంటే ఇలాంటి సందర్భాల్లో అధికంగా దొంగతనాలు జరుగుతాయని తెలిపారు. దొంగలు నిఘా పెట్టి నగదు, బంగారు నగలు ఎత్తుకెళ్తారని హెచ్చరించారు. ఇంటికి తాళాలు వేసి ఊరు వెళ్లాల్సి వస్తే తగిన ఏర్పాట్లు చేసుకున్న తర్వాతే వెళ్లాలని చెప్పారు. లేదంటే తిరిగి వచ్చే లోపు దోపిడీకి గురయ్యే అవకాశం ఉందని, విలువైన వస్తువులు ఉంటాయో లేదో గ్యారెంటీ ఉండదని చెప్పారు. 'దసరా పండగ సెలవులకు ఊరు వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంకు లాకర్లలో భద్రపర్చు కోవాలని సూచించారు. లేదంటే ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలి. సెలవుల్లో బయటకు వెళ్తున్నప్పుడు సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్ ఏర్పాటు చేసుకోవడం మంచిది. మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉన్న తాళాలు అమర్చుకోవడం ఉత్తమం. తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. లేకుంటే డయల్ 100కు ఫోన్ చేయాలి. వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోవాలి. ద్విచక్రవాహనాలకు తాళాలు వేయడం మర్చిపోవద్దు. వీలైతే చక్రాలను ఇనుప గొలుసుతో లాక్ వేయడం మంచిదన్నారు. నమ్మకమైన వాచ్‌మెన్లను మాత్రమే సెక్యూరిటీ గార్డులుగా నియమించు కోవాలి. ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో చూసుకుంటూ ఉండాలి. మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్తా చెదారం, వార్తా పత్రికలు, పాలప్యాకెట్లు లేకుండా చూసుకోవాలి. ఎందుకంటే అవి ఉంటే మీరు ఇంట్లో లేరనే సమాచారం దొంగలకు తెలిసిపోతుంది. వాటినీ గమనించి దుండగులు దోపిడీకి పాల్పడుతుంటారు. మెయిన్ డోర్‌కి తాళం కప్ప వేసినప్పటికీ అది కనిపించకుండా కర్టెన్స్‌తో కవర్ చేయాలి. బయటకు వెళ్లేటప్పుడు ఇంటి లోపల, బయట కొన్ని లైట్లు వేసి ఉంటే మంచిది. అలా చేస్తే ఇంట్లో మనుషులు ఉన్నారనుకుని దొంగలు రాకుండా ఉంటారు. ఇంటి చుట్టుపక్కల నమ్మకమైన ఇరుగు పొరుగు వారిని మీ ఇంటి గమనిస్తూ ఉండమని చెప్పడం మంచిది. యీ ఇంటికి వచ్చే, వెళ్లేదారులు, ఇంటి లోపల సీసీ కెమెరాలు అమర్చుకుని డీవీఆర్ కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశంలో పెట్టుకోవాలి. అల్మరా, కబోర్డ్సకు సంబంధించిన తాళాలు కామన్ ఏరియాలైన చెప్పుల స్టాండ్, పరుపులు, దిండ్ల కింద, అల్మరాపైన, డ్రెస్సింగ్ టేబుల్‌లో ఉంచకుండా సీక్రెట్ ఏరియాలో దాయాలి. బంగారు ఆభరణాలు వేసుకుని ఫంక్షన్లకు వెళ్లేటప్పుడు జాగ్రతలు తీసుకోవాలి. సోషల్ మీడియాలో మీరు బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడం మంచిది కాదు. అలా చేస్తే ఇంట్లో లేరన్న విషయం తెలిసిపోయి దొంగలు పడే అవకాశం ఉంటుంది. కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలు నిర్వహించుకోవాలి. ఎవరిమీదైనా అనుమానం వస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 100, సైబరాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్ 9490617100 లేదా వాట్సాప్ నంబర్ 9490617444కు ఫోన్ చేయండి' అని పోలీసులు సూచించారు.

## సిద్ధరామయ్యపై ఈడీ కేసు

**లోకాయుక్త ఎఫ్ఐఆర్ ఆధారంగా నమోదు**
**ముడా ప్లాట్ల కేటాయింపులో మనీలాండరింగ్ కేసు**



**న్యూఢిల్లీ/బెంగళూరు: సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారం మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ప్లాట్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయని లోకాయుక్త నమోదు చేసిన ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) ఆధారంగా ఈ చర్యకు దిగింది. సిద్ధరామయ్య, భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి తదితరులపై కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు నమోదు చేసింది. పార్వతి నుంచి 3.16 ఎకరాలను సేకరించిన ముడా ప్రతిగా 50:50 నిష్పత్తిలో ఖరీదైన ప్రాంతంలో ఆమెకు 14 ప్లాట్లను కేటాయించింది. దీంట్లో అవినీతి, అధికార దుర్వినియోగం జరిగినట్టు ఆరోపణలున్నాయి. ఈ కేసులో సిద్ధరామయ్యను ప్రాసిక్యూట్ చేయడానికి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ అనుమతి మంజూరు చేశారు. దీన్ని సిద్ధూ హైకోర్టులో సవాల్ చేసినా చుక్కెదురైంది. అనంతరం బెంగళూరులోని ప్రత్యేక కోర్టు ఆదేశాల మేరకు ఆయనపై లోకాయుక్త పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దాని ఆధారంగా సిద్ధరామయ్య తదితరులపై ఈడీ సోమవారం కేసు నమోదు చేసింది. విచారణకు రావాలంటూ ఆయనకు సమన్లు జారీ చేసే వీలుంది. అలాగే ఆస్తులను కూడా అటాచ్ చేయవచ్చు.

**14 ప్లాట్లను వెనక్కి ఇచ్చేస్తా:**
**ముడా కమిషనర్‌కు పార్వతి లేఖ**

మైసూరు: భూపరిహారంగా ముడా తనకు కేటాయించిన 14 ప్లాట్లను వెనక్కి ఇచ్చేందుకు కర్నాటక సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతి ముందుకు వచ్చారు. ఈ మేరకు ముడా కమిషనర్‌కు సోమవారం ఆమె లేఖ రాశారు. మైసూరు కేసరే గ్రామంలో తనకు చెందిన 3.16 ఎకరాల భూమిని ముడా తీసుకొని.. విజయనగర లేఔట్ ఫేజ్-3, ఫేజ్-4లో తనకు 14 ప్లాట్లను కేటాయించిందని ఆమె వివరించారు. 'సేల్ డీడ్‌ను రద్దు చేయడం ద్వారా నేనీ 14 ప్లాట్లను తిరిగి ఇచ్చేయడానికి సిద్ధంగా ఉన్నాను. ముడా ఈ ప్లాట్లను స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నాను. ఈ దిశగా సాధ్యమైనంత త్వరగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని పార్వతి ముడా కమిషనర్‌ను కోరారు. ముడా కేటాయింపుల్లో సిద్ధరామయ్యపై దర్యాప్తునకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం, లోకాయుక్త పోలీసుల కేసు నమోదు, తాజాగా సోమవారం ఈడీ కేసు నమోదు నేపథ్యంలో.. ప్లాట్లను తిరిగి ఇచ్చేయాలని పార్వతి నిర్ణయం తీసుకున్నారు.





## మూడోరోజూ కొనసాగిన సిట్ దర్యాప్తు

**తిరుమలలో**
**పలు విభాగాల్లో బృందం తనిఖీలు**

**తిరుమల, సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంలో మూడో రోజు సిట్ బృందం విచారణ ముగిసింది. తిరుపతి నుంచి ఉదయం 10 గంటలకు తిరుమల చేరుకున్న దర్యాప్తు బృందం.. తిరుమల తిరుపతి దేవస్థానం పిండిమర, ల్యాబ్‌లో విస్తృతంగా దర్యాప్తు చేశారు. ప్రసాదాల తయారీకి వినియోగించే ముడి సరకులు నిల్వ చేసే గోదాములను సైతం అధికారులు తనిఖీ చేశారు. ఇప్పటికే నిల్వ చేసిన వాటి నాణ్యతను పరిశీలించారు. తితిదే కొనుగోలు చేసే వస్తువుల నాణ్యతను ఏ విధంగా పరిశీలిస్తారనే అంశాన్ని పూర్తి స్థాయిలో అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి నాణ్యతను ఏ విధంగా పరీక్షిస్తారు.. ఎలాంటి ప్రమాణాలు పాటిస్తారనే విషయాలను తితిదే సాంకేతిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు చేస్తున్న సమయంలో తిరుమలకు చేరుకున్న నెయ్యి ట్యాంకర్ల నుంచి నమూనాలను అధికారులు సేకరించారు. నెయ్యి నాణ్యతను పరీక్షించే పక్రియను అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. లడ్డూ పోటులో విధులు నిర్వర్తించే ఉద్యోగులను విచారణ చేయాల్సి ఉండగా.. సమయాభావం కారణంగా ఇవాళ కుదరలేదని అధికారులు తెలిపారు. అనంతరం తిరుమల నుంచి సిట్ అధికారులు తిరుపతి బయలుదేరి వెళ్లిపోయారు.

## నిర్మలకు ఊరట

**దర్యాప్తుపై హైకోర్టు స్టే**



**బెంగళూరు: సెప్టెంబర్ 30 (ప్రభాత సూర్యుడు):** కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు ఊరట లభించింది. ఈడీని అడ్డం పెట్టుకొని వ్యాపారవేత్తలను బెదిరించి ఎలక్టోరల్ బాండ్ల పేరిట కోట్లాది రూపాయలు వసూలు చేశారనే కేసులో నిర్మల, ఇతరులపై సాగుతున్న దర్యాప్తుపై కర్నాటక హైకోర్టు సోమవారం స్టే విధించింది. నిందితుల్లో ఒకరైన బీజేపీ నేత నళిన్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఎం.నాగప్రసన్న దర్యాప్తుపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. తదుపరి విచారణను అక్టోబరు 22కు వాయిదా వేశారు. ఆదర్శ్ ఆర్ అయ్యర్ చేసిన ఫిర్యాదు మేరకు.. స్పెషల్ కోర్టు ఆదేశాలతో నిర్మలా సీతారామన్, బీజేపీ జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఈడీ అధికారులపై శనివారం ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతీయ న్యాయసంహిత సెక్షన్ 384 (బెదిరించి డబ్బు గుంజడం), 120బి (నేరపూరిత కుట్ర), సెక్షన్ 34 కింద వీరిపై కేసు నమోదైంది.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Akshaya Printers, H.No:7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City, Telangana. Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215